తార్నాక జంక్షన్‌కు విముక్తి

వాహనదారుల్లో హర్షాతిరేకాలు | 8 ఏళ్ల అనంతరం మూసివేతను తొలగించనున్న అధికారులు

ప్రధాన రహదారుల ఆధునీకరణ, ట్రాఫిక్ సమస్యల నివారణకు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయ అధికారులు చేపట్టిన 'కన్వర్‌జెన్స్' కమిటీల అధ్యయనాలు ఫలితాలను రాబడుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులను జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేస్తూ రహదారుల సుందరీకరణ, విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన 'కన్వర్‌జెన్స్' కమిటీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తార్నాక కూడలి విషయంలో తీసుకున్న నిర్ణయం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో తార్నాక కూడలిని ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తును వేగవంతం చేశారు.

– సికింద్రాబాద్.



కూడలిహద్దారులను విస్తరిస్తున్న అధికారులు


తార్నాక కూడలిలో మూసివేసిన జంక్షన్

ఎనిమిదేళ్ల ఇబ్బందులు...

తార్నాక జంక్షన్‌ను ఎనిమిదేళ్ల క్రితం మూసివేశారు. మెట్రో పిల్లర్ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని భావించిన అప్పటి అధికారులు జంక్షన్‌ను మూసివేశారు. ప్రత్యామ్నాయంగా ఉప్పల్ వైపు ఐఐసీటీ, మెట్టుగూడ వైపు రైల్వే డిగ్రీ కళాశాల సమీపంలో 'యూ' టర్న్‌లను ఏర్పాటు చేశారు. దీంతో తార్నాక కూడలిలో ట్రాఫిక్ సమస్యలకు కొంత పరిష్కారం లభించినా... కిలో మీటర్ల మేర ప్రయాణించి వాహనాలు తిప్పుకొని రావడం వాహనదారులకు గుదిబండగా మారింది. భారీ వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో తీవ్రంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఫ్లై ఓవర్‌తో ప్రమాదాలు...

తార్నాక కూడలి మీదుగా ఫ్లై ఓవర్ ఉండడంతో ప్రమాదాలకు హేతువులుగా 'యూ' టర్న్‌లు మారుతున్నాయి. రెండు వైపులా ఫ్లై ఓవర్ ఎక్కి దిగే వాహనాలు వేగంగా వెళుతుండడం, కొంత దూరంలోనే యూ టర్న్‌లు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన యూ టర్న్‌ల వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు. ఉదయం, సాయంత్రం కార్యాలయాల సమయంలో సమస్యలు మరింత జటిలం అవుతున్నాయి. రెండు యూ టర్న్‌ల వద్ద పలువురు ట్రాఫిక్ పోలీసులు పహారా కాస్తే కానీ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలను నివారించని పరిస్థితులు ఎదురవుతున్నాయి.

'కన్వర్‌జెన్స్' కమిటీ నిర్ణయంతో...

జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, సిటీ ట్రాఫిక్ అదనపు కమిషనర్ నేతృత్వంలోని కన్వర్‌జెన్స్ కమిటీ తార్నాకలో పర్యటించింది. ఇక్కడ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల గురించి అధ్యయనం చేసింది. వీటిని నివారించడానికి కోసం యూ టర్న్‌లను తొలగించి, ఎనిమిదేళ్ల క్రితం మూసివేసిన తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. కన్వర్‌జెన్స్ కమిటీ నిర్ణయం పట్ల ప్రయాణికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు...

- తార్నాక జంక్షన్ పునరుద్ధరణ కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు నేతృత్వంలో పనులు ప్రారంభమయ్యాయి. కూడలి ఆధునీకరణ, విస్తరణ కోసం రూ.40 లక్షలు కేటాయించారు.
- ఇప్పటికే కూడలి నుంచి సెయింట్ ఆన్స్‌రోడ్‌లోని రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. మరో నాలుగు భవనాలను పాక్షికంగా తొగించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- కూడలిలోని రెండు పెట్రో బంకుల యజమానులు చెరో ఆరు ఫీట్ల స్థలాన్ని ఆక్రమించినట్టు, మరో టిఫిన్ సెంటర్ యజమాని ఎనిమిది ఫీట్ల రహదారి స్థలాన్ని ఆక్రమించినట్టు గుర్తించిన అధికారులు త్వరలో ఆక్రమణలు తొలగించనున్నారు.
- ట్రాఫిక్ ఐల్యాండ్, కూడలికి నాలుగు వైపులా బస్‌బేలు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు కోసం యూనివర్సిటీ అధికారుల నుంచి స్థల సేకరణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల్లో విస్తరణ పనుల కోసం టెండర్లు ఖరారు చేమనున్నట్టు అధికారులు తెలిపారు.

అధికారుల చర్యలు అభినందనీయం


తార్నాక జంక్షన్ మూసివేతతో ఎనిమిదేళ్లుగా ఎన్నో కష్టాలు అనుభవించాం. కూడలి దాటడం కోసం మూడు కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఎనిమిదేళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రయాణికులు మృతి చెందారు. ఈ నెలాఖరు కల్లా జంక్షన్ నుంచి రాకపోకలు పునరుద్ధరిస్తుండడం అభినందనీయం.

– సందీప్, వాహనదారుడు

డిసెంబర్ 1 నుంచి రాకపోకలు


ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిస్థాయి అధ్యయనం చేసిన మీదట తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నాం. విస్తరణ పనులు తుదిదశకు చేరాయి. ఆధునీకరణ, బస్‌బేల ఏర్పాటు పనులు కొద్ది రోజుల్లో పూర్తిచేస్తాం. ట్రాఫిక్ సమస్యలు కూడలిలో ఎదురవకుండా ఉండేందుకు కసరత్తు చేస్తున్నాం. డిసెంబర్ 1 నుంచి జంక్షన్‌ను వాహనదారులకు అందుబాటులోకి తెస్తా.

– ఎస్.రవికిరణ్, జోనల్ కమిషనర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: చెట్ల కొమ్మల నరికివేత, ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం బోయిన్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు అమల్లో ఉంటాయని కంటోన్మెంట్ ఏడీఈ లక్ష్మీ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి ఫీడర్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లికార్జున నగర్, యాదవ బస్తీ, ఫ్రెండ్స్ కాలనీ, సాయి కృష్ణ కాలనీ, బోయిన్‌పల్లి చౌరస్తా, చత్రి గడ్డ, భాగ్యశ్రీ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హస్మత్‌పేట ఫీడర్ పరిధిలోని హస్మత్‌పేట, ముస్లిం బస్తీ, లయన్ స్టోన్ కాలనీ, అంబర్ నగర్, ట్రినిటీ టవర్స్, సూర్య ఎన్‌క్లేవ్, సత్య ఆర్కేడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సనత్‌నగర్: బేగంపేట్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత్ కాలనీ, బల్కంపేట్, బీకేగూడ మసీదు, ఈఎస్‌ఐ స్టాఫ్ క్వార్టర్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాతాచారికాలనీ, బొంబే అల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా, గురుమూర్తిలేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఆదర్శనగర్‌లో వెలగని వీధిదీపాలు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజుల నుంచి స్ట్రీట్ లైట్స్(వీధి దీపాలు) వెలుగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో కాలనీలు, బస్తీలలో చీకట్లు అలుముకుంటున్నాయి. ప్రధానంగా శాంతినగర్ ఆదర్శనగర్‌లో వారం రోజుల నుంచి వీధి దీపాలు వెలుగ స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటికి రాలేకపోతున్నారు. బస్తీ రోడ్లపై నుంచి ఎవరు వెళుతున్నారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి

రసూల్‌పురా: తిరుమలగిరి కేవీ సంఘటన్ విద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు బుధవారం ముగిసాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఆంధ్ర సబ్‌ఏరియా ఎడ్యుకేషన్ డైరక్టర్ బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి హాజరయ్యారు. ఏకే భారత్ శ్రేష్ఠ భారత్ థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో 25 కేవీ సంఘటన్ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులు బిన్నత్వంలో ఏకత్వం చాటుతూ వారి రాష్ట్రాల సంస్కృతి వారసత్వాన్ని ఘనంగా ప్రదర్శించారని కొనియాడారు. కేవీఎస్ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ ఏకత్వ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్ళేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించడం ప్రశంసనీయమని అన్నారు.

లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

సనత్‌నగర్: తాను ఓ దినపత్రిక విలేకరినంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతిని పరిచయం చేసుకుని ఆపై ప్రేమిస్తున్నానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు..ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో నివసించే యువతి (22)కి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రవీణ్‌ముదిరాజ్ (28) పరిచయమయ్యాడు. తాను ఓ దినపత్రిక విలేకరినంటూ చెప్పుకుని ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు. ఈ ఏడాది అక్టోబర్ 30వ తేదీన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేటలో గల సిన్కో హోటల్‌కు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో పాటు యువతి ఫోటోలు, వీడియోలు తీసుకుని బెదిరించడం మొదలుపెట్టారు. దీంతో బాధితురాలు ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.25, నల్లవంకాయ 50, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 26, పందిరి బీర 35, క్యాబేజీ 35, క్యారెట్ 75, దొండ 23, గుండుబీన్స్ 53, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 17, దోసకాయ 35, బీట్‌రూట్ 55, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆధ్యాత్మికతతో అన్నీ శుభాలే : ఎమ్మెల్యే శ్రీగణేశ్


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఆధ్యాత్మిక భావనతో అన్నీ శుభాలే కలుగుతాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానము (టీటీడీ) ఆధ్వర్యంలోని బోయిన్‌పల్లిలోని శ్రీ వెంకటేశ్వర వేదాం తవర్ధిని సంస్కృత కళాశాలలో క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, సుదర్శన హోమము, సత్యనారాయణ వ్రతము కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు. సంస్కృత కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పూజా కార్యక్రమాల్లో కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ బానోత్ సురేందర్, హెడ్మాస్టర్ కిషన్, లంకా సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, వారి కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు కార్యాలయ సిబ్బంది పూర్వ ఆచార్యులు పూర్వ విద్యార్థులు, కాంగ్రెస్ నేతలు అజయ్ కుమార్, శరత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల ప్రారంభం


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. తుకారాంగేట్‌లోని రియో పాయింట్ హోటల్ నుండి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు ఏర్పాటు చేయనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ..పైప్‌లైప్ పనుల్లో జాప్యం కనబరచకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురవాలని అధికారులకు సూచించారు. జలమండలి డీజీఎం విద్యాసాగర్, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీను, సత్తయ్య, దాసరి శ్రీను, కైరంకొండ పాల్గొన్నారు.

రైల్వేలో సేవ చేయడమంటే దేశ సేవ చేయడమే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

అడ్డగుట్ట: దేశ సరిహద్దులో సైనికులు మాదిరిగానే దేశంలోపల నిత్యం రైల్వేలో ప్రయాణించే లక్షలాది మంది ప్రజలకు రక్షణ కల్పిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది కూడా దేశ రక్షణలో సేవలందిస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. బుధవారం చిలకలగూడలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ తాను కూడా ఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబానికి చెందిన వ్యక్తినేనని, తన తండ్రి ఆర్పీఎఫ్ ఉద్యోగి అని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. రైల్వేకు సేవ చేయడం దేశానికి సేవ చేయడమేనని పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్ల జాతీయ అధ్యక్షుడు ఆర్‌పీఎస్ రాఘవరావు, ఫిషరీస్ డైరెక్టర్ దేవేందర్, వరప్రసాద రెడ్డి, జీవీఎస్. రాయుడు, ముత్యాలు పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువు విస్తీర్ణంపై సమగ్ర విచారణ

- హైడ్రా కమిషనర్ రంగనాథ్


చెరువును పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరుతున్న ఎర్రకుంట వాసులు

లాలాపేట: హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని ఎర్రకుంట చెరువును పరిశీలించారు. చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్ కొమ్మగల్ల వెంకటేశ్వర్లు అన్యాక్రాంతం అవుతున్న చెరువులను పరిరక్షించాలని కోరుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎర్రకుంట చెరువును పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న ఎర్రకుంట బస్తీ వాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని చెరువును పునరుద్ధరించాలని కోరారు. చెరువు తూముపై అక్రమంగా చేసిన కమర్షియల్ నిర్మాణాన్ని తొలగించాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాటుగా చెరువు భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఎర్రకుంట వాసులు, తార్నాకలోని పలు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రంగనాథ్ తార్నాక ఎర్రకుంట చెరువుపై సమగ్ర విచారణం చేస్తామన్నారు. 6 ఎకరాల విస్తీర్ణంలోని ఎఫ్‌టిఎల్‌ను ముందు అభివృద్ధి చేస్తామన్నారు. అన్యాక్రాంతమైన 26 ఎకరాల చెరువు భూములపై విచారణ చేస్తామన్నారు. చెరువు భూములను కొనుగోలు చేసిన వారు తమ పత్రాలను హైడ్రా కార్యాలయంలో సమర్పించాలనీ సూచించారు. డిప్యూటీ కలెక్టర్ సుధా, మారెడుపల్లి తహసీల్దార్ బీమయ్య గౌడ్ తదితరులున్నారు.

డీఐ పోస్టుల భర్తీ

సనత్‌నగర్: వెయిటింగ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్లకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు (డీఐ)లుగా బాధ్యతలు అప్పగిస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ డీఐగా జయశంకర్, రాంగోపాల్‌పేట డీఐగా రౌతు గోపికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్రాలు





లాలాపేట: తార్నాకలోని ఐఐసిటి స్టాఫ్ క్లబ్‌లో కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి చేనేత హస్త కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కళాఖండాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. నగర ప్రజలకు అవసరమైన అన్ని రకాల పట్టు చీరలు, కాటన్ వస్త్రాలు, దుప్పట్లు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ వస్త్రాలు, కర్టెన్లు, హస్తకళాకారుల తయారు చేసిన కళాఖండాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 17 వరకు కొనసాగుతుందన్నారు.

ప్రయాణికుడి ప్రాణాలు తీసిన చోరీ

- రైలులోంచి కిందపడ్డ ప్రయాణికుడు
- చికిత్స పొందుతూ మృతి
- నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: సెల్‌ఫోన్ దొంగ వికృతచేష్టల ఫలితంగా రైలులోంచి కిందపడిన ఓ ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్లు బీ.సాయీశ్వర్‌గౌడ్, బీఎస్ సారస్వత్ కథనం ప్రకారం... వరంగల్ జిల్లాకు చెందిన దినేశ్ (25) ఈనెల 1న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రైలులో వెళుతున్నాడు. శాతవాహన రైలు జనరల్ బోగీలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో బోగీడోర్ వద్ద కూర్చున్నాడు. లాలాగూడ రైల్వేస్టేషన్ వద్ద రైలు మెల్లగా కదులుతున్న సమయంలో ఒక అగంతకుడు దినేశ్ చేతిలోని సెల్‌ఫోన్ దొంగిలించేందుకు ప్రయత్నించాడు. దినేశ్ చేతిని బలంగా లాగుతూ అగంతకుడు రైలు కిందకు దూకేశాడు. ఈ ప్రమాదంలో దినేశ్ రైలు నుంచి కిందపడిపోయాడు. చక్రాల కిందపడిపోవడంతో ఒక కాలు మొత్తంగా తెగిపోగా మిగతా కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు గాంధీసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఈ నెల 5వ తేదీన దినేశ్ మృతి చెందాడు. హత్యా నేరం నమోదు చేసిన జీఆర్‌పీ పోలీసులు ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా కర్నాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా చుమిలి గ్రామానికి చెందిన లింగప్ప (28) సెల్‌ఫోన్ చోరీ చేయడంతోపాటు, దినేశ్ మృతికి కారకుడిగా పోలీసులు గుర్తించారు. లాలాగూడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచరిస్తున్న లింగప్పను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించాడు. ఏడాది క్రితం నగరానికి వచ్చిన నిందితుడు సికింద్రాబాద్–కాజీపేట మార్గంలో రద్దీగా ఉన్న రైళ్లను ఎంపిక చేసుకుని స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన 10 కిలోల జంగాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ జావెద్ తెలిపారు.

ఉసిరికాయలతో అలంకారం



సనత్‌నగర్: కార్తీక మాస విశేష పూజల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో మల్లికార్జునుడు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఉసిరికాయలతో స్వామి వారిని అలంకరించారు.

కాలుష్య కారకాల ప్రభావంపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సనత్‌నగర్: వాయు, జల, శబ్ద కాలుష్యాలు మానవుని ఆరోగ్యాన్ని ఏవిధంగా దెబ్బతీస్తున్నాయనే అంశంపై సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీజీపీసీబీ విద్యా సెషన్‌లో భాగంగా డీఆర్ఎస్ స్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థులతో అధికారులు ఇంటరాక్ట్ అయ్యి హానికర వ్యర్థాల ప్రభావాల గురించి తెలియజేశారు. నివాస, సున్నిత, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలను ఏవిధంగా తెలుసుకోవచ్చో వారికి చూపించారు. అలాగే శబ్ద కాలుష్య స్థాయి ప్రమాణాలను నమోదు గురించి తెలియజేశారు. తమ జీవనశైలిలో విద్యార్థులు మార్పులు చేసుకోవాలని హితవు పలికారు. అలాగే విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

'మహాలక్ష్మి'తో ఉపాధి కోల్పోయాం


రైల్వే స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

కంటోన్మెంట్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వి చక్ర వాహనాల మూలంగా ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయినట్లు బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హబీబ్ అన్నారు. తెలంగాణ ఆటో డ్రైవర్స్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో బిక్షాటన చేశారు. ప్రయాణికులు పాదచారుల వద్ద తమ గోడును వెళ్ళబోసుకుంటూ వినూత్నంగా బిక్షాటన చేపట్టారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి తామ వ్యతిరేకం కాకపోయినప్పటికీ ఎనిమిది లక్షల కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని అన్నారు. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని, ఈనెల 21న ఇందిరాపార్క్ లో ఆటో డ్రైవర్ల మహా ధర్నా కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని అన్నారు.